

ఇరుకు వంతెనపై వాహనాల రాకపోకలు

కోపల్లె వంతెన కలేనా?

ఏళ్ల తరబడి ఎన్నికల హామీగా..

నిత్యం వేలాది మంది ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తారు..వందల కొద్దీ వాహనాలు వెళుతుంటాయి..అయితే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు కాల్వలో కలిసిపోతాయి..ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణాలు సాగించే పరిస్థితి.. భీమవరం - గుడివాడ రాష్ట్రీయ రహదారిపై కాళ్ల మండలం కోపల్లె వద్ద బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. రక్షణ గోడలు ధ్వంసం అయ్యాయి.మండలంలోని అన్ని గ్రామాల నుంచి భీమవరం వెళ్లడానికి ఈ వంతెనే ప్రధానం. భీమవరం నుంచి విజయవాడ ఇతర పట్టణాలకు వెళ్లాలంటే ఇది దగ్గర మార్గం. ఇరుకు వంతెన కావడంతో ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతుంది. పెళ్ళిళ్ల సీజన్‌లో అయితే కిలోమీటర్ల మేర వాహనాలతో నిలిచిపోయి ప్రయాణికులు నానా అవస్థలు పడుతుంటారు. 1995 నుంచి 2024 వరకూ ప్రతిసారి సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో వంతెన నిర్మాణం చేపడతామని పాలకులు హామీలు ఇచ్చారు. 'నిధులు వచ్చాయి.. పనులు జరుగుతాయి..' అని చెప్పడమే తప్ప ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తానని చెబుతున్నట్లు కూటమి నాయకులు అంటున్నారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా వెంటనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు ఈ వంతెన నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు మంజూరు చేయించి టెండర్లు పిలిచారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు అవ్వవని భయపడి కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. -కాళ్ళ (ఆంధ్రజ్యోతి)


ప్రమాదకరంగా కోపల్లె బ్రిడ్జి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో

మోడల్ కోడ్ పాటించాలి

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ : డీఆర్వో

భీమవరం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో మోడల్ కోడ్‌ను రాజకీయ పార్టీలు తూచ తప్పక పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు కోరారు. భీమవరం కలెక్టరేట్ డీఆర్వో ఛాంబర్‌లో ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్, మోడల్ కోడ్ గురించి వివరించారు. ఈనెల 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. ఫిబ్రవరి 3 నుంచి 10 వరకూ ఏలూరు కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ బ్యాలెట్ పేపర్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారన్నారు. వచ్చేనెల 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 69,884 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారన్నారు. వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు వంశీరెడ్డి, ఎం.అంజనేయులు, రంగరాజు, టీడీపీ ఎం.శ్యాంబాబు, జయ శివ, ఇన్‌చార్జి ఎలక్షన్ సూపరింటెండెంట్ మర్రాపు సన్యాసిరావు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై తెలుగుదేశం కూటమి పట్టు బిగిస్తోంది. విజయం ఏకపక్షం చేయాలన్న తలంపుతో ప్రణాళికలు రచిస్తోంది. ఎన్నికలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉంది. ఇప్పటిదాకా తమ అభ్యర్థిని ప్రకటించ లేదు. ఓ..ఉపాధ్యాయ సంఘం నుంచే తెలుగుదేశం కూటమి అభ్యర్థికి పోటీ ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. (భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి పట్టు





ఎలక్షన్ టైమ్

- సాధారణ ఎన్నికల తరహాలో ప్రణాళికలు
- ప్రతి 30 మంది ఓటర్లకు ఓ ప్రతినిధి
- నియోజకవర్గాల వారీగా నియామకం
- ఫిబ్రవరి 10 వరకు ఓటు నమోదుకు అవకాశం
- మార్చి 8 వరకు గ్రీవెన్స్ సెల్ రద్దు

ఓటర్ల నమోదు నుంచి ఎన్నిక వరకు అంతా కూటమి నేతలు ముందు చూపుతో వ్యవహరిస్తున్నారు. రెండు నెలల క్రితమే ఉభయగోదావరి జిల్లాల కూటమి అభ్యర్థిని ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ నేత రాజశేఖర్‌కు కూటమి తరఫున బరిలో దింపారు. నియోజక వర్గాల వారీగా పలు మార్లు సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు, ముఖ్య నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నిక కోసం కసరత్తు చేశారు. ఓటర్ల నమోదు బాధ్యతను కూడా కూటమి నేతలు తీసుకున్నారు. పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేలా గట్టి ప్రయత్నమే చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్న పట్టభద్రులు సైతం ఈ సారి ఓటు నమోదుకు ఆసక్తి కనబరిచారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్ మాత్రం 50 శాతానికి మించడం లేదు. ఈ సారి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కూటమి ప్రయత్నిస్తోంది. ఇప్పటిదాకా రాజకీయాలతో ప్రమేయం లేని వారే పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రాజకీయ పార్టీల నుంచి అభ్యర్థిగా బరిలో నిలచిన వారికి చేదు అనుభవమే మిగిలింది. ఈసారి ఎన్నికల్లో మాత్రం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తెలుగుదేశం కూటమి అభ్యర్థికి అవకాశాలే అధికమంటూ నేతలు ధీమాగా ఉన్నారు.

కమిటీల ఏర్పాటు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం కూటమి అధిష్ఠానం నియోకజవర్గాల వారీగా కమిటీలు వేయాలని దిశానిర్దేశం చేసింది. ప్రతి 30 మంది ఓటర్లకు ఒక ప్రతినిధిని నియమించనున్నారు. కూటమి నాయకులనే ప్రతినిధులుగా ఎంపిక చేస్తారు. అలాగే ప్రతి 1000 మందికి నియోజకవర్గంలోని ముఖ్య నాయకుల్లో ఒకరిని ఆర్గనైజర్‌గా నియమిస్తారు. వారే ఎన్నికల ప్రచార బాధ్యతలను, పట్టభద్రులంతా కూటమి అభ్యర్థికి ఓటు వేసేలా కృషి చేస్తారు. జిల్లాలోని ఏడు నియోకవర్గాల్లోనూ సమావేశాలు ఏర్పాటు చేసి ముందుగా ప్రతినిధులను నియమించేలా కసరత్తు చేస్తున్నారు.

పలువురి నేతల హడావుడి

కూటమి అధిష్ఠానం ఎప్పటికప్పుడు నియోకవర్గాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆరా తీస్తోంది. టెలికాన్ఫరెన్స్‌లు ఏర్పాటు చేసి తెలుసుకుంటోంది. కొందరు ముఖ్య నేతలు అధిష్ఠానానికి అతిగా చెపుతున్నారు. మొదటి విడత ప్రచారాలు పూర్తి చేసేశామంటూ హడావుడి చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. పట్టభద్రుల ఓటు నమోదు విషయంలోనూ ఇదే పద్ధతిలో వ్యవహ రించారు. ఓటు నమోదు అంతా తమ ఘనతగా చెప్పుకునే ప్రయత్నం చేశారు. క్షేత్రస్థాయిలో శ్రమించడం లేదు. దీనివల్ల ఓటింగ్‌పై ప్రభావం చూపుతుందంటూ కూటమి కేడర్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే వైసీపీ హయాంలో రాష్ట్రంలోని ఇతర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థులు సునాయాస విజయం సాధించారు. ఇప్పుడు తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చింది. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానంలో విజయం తమదేనన్న ధీమా కూటమిలో బలంగా ఉంది.

ఓటు నమోదుకు ఇంకా అవకాశం

పట్టభద్రుల ఓటు నమోదు కోసం ఈ నెల 10వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అప్పటిదాకా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆ తర్వాత తుది జాబితాను ప్రకటిస్తారు. ఇప్పటికే ఉభయగోదావరి జిల్లాకు సంబంధించి పట్టభద్రుల ఓటర్ల సంఖ్య తేలింది. అయినా మరో ఎనిమిది రోజుల వరకు అవకాశం కల్పించారు. ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా తెలుగుదేశం కూటమి భావిస్తోంది. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రచించింది. ఓటర్లను గుర్తించి ఓటు వేసేలా చూసే బాధ్యతను ఎంపిక చేసిన ప్రతినిధులకు అప్పగించనున్నారు. ఎన్నికల వరకు వారు ప్రతినిధులుగా ఉంటారు. వారిపై ఆర్గనైజర్లుంటారు. వారి కనుసన్నల్లోనే కూటమి ఎంఎల్‌ఎసి అభ్యర్థికి ఓటు వేసేలా పట్టభద్రుల్లో ప్రచారం చేయనున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో కూటమి అధిష్ఠానం వేగం పెంచింది. కేడర్‌ను అప్రమత్తం చేస్తున్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కేడర్‌ను రంగంలోకి దింపుతోంది. వారంతా ఓటు వేసే బాధ్యతను కమిటీలకు అప్పగిస్తున్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలతో పాటు గణపవరం మండలంతో కలిపి 69,884 మంది పట్టభద్రుల ఓటర్లున్నారు. అందులో 39,780 మంది పురుషులు, 30,103 మంది మహిళలు, ఇతరుల ఒకరున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేశారు. ప్రతి సోమవారం నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని మార్చి 8వ తేదీ వరకు నిలిపి వేశారు. జిల్లా కలెక్టరేట్‌కు, రెవెన్యూ డివిజన్ కేంద్రాలకు సమస్యలు చెప్పుకోవడానికి సోమవారం రావద్దంటూ కలెక్టర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నిక అనంతరం తిరిగి స్పందన కార్యక్రమం ఉంటుంది.



అక్కరకు రాని అగ్రికల్చర్ ల్యాబ్‌లు

వైసీపీ ప్రభుత్వంలో కోట్లు వెచ్చించి నిర్మించారు

పట్టించుకోకుండా వదిలేశారు

పెనుమంట్ర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు నిర్మించి ప్రతి నియోజకవర్గానికి అగ్రికల్చర్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని భావించింది. లక్ష్యం మంచిదైనప్పటికీ ఆచరణలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. భూసార పరీక్షలు, పశు సంవర్ధక శాఖ పరీక్షలకు, ఆక్వా కల్చర్ అభివృద్ధిలో భాగంగా టెస్టింగ్ ల్యాబ్‌లను సాగు రైతులకు అందుబాటులోకి తేవాలని భవనాలను కూడా నిర్మించారు. వైసీపీ ప్రభుత్వంలో ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగ నాథరాజు ఎన్నికల ముందు హడావుడిగా మార్టేరులో అగ్రికల్చర్ టెస్టింగ్ ల్యాబ్‌ను నిర్మాణం చేసి ప్రారంభించారు. సుమారు కోటిన్నర రూపాయల వెచ్చించినా ఆచరణలో మాత్రం లక్ష్యాన్ని అధిగమించలేదు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి నిర్మించిన ఈ భవనం నిర్మాణం అయితే పూర్తయింది కానీ విద్యుదీకరణకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. దీంతోపాటు టెస్టింగ్ ల్యాబ్‌కి అవసరమైన పరికరాలను సమకూర్చలేదు. సిబ్బందిని కూడా నియమించకుండా మార్టేరు ఏడీఏ పరిధిలోని ఏఈవోని ఇన్‌చార్జిగా నియమించి చేతులు దులుపుకున్నారు. నేటి వరకు ల్యాబ్ తలుపులు తీసిన పాపాన పోలేదు. అధికార యంత్రాంగం ఇప్పటికైనా ఈ భవనాన్ని రైతాంగానికి అందుబాటులోకి తీసుకువస్తే ఆక్వా, వరి రైతులతో పాటు పాడి రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

భయపెడుతున్న సుగర్, బీపీ

జిల్లాలో పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు

వైద్య ఆరోగ్య శాఖ సర్వేలో వెల్లడి

భీమవరం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా అంటే వ్యవసాయ రంగానికి పెట్టింది పేరు. శ్రమజీవులకు ఇక్కడ కొదువ లేదు. కాయం కష్టం చేసేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. శారీరకంగా ఎంత శ్రమిస్తే ఆరోగ్యం అంత బావుంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతారు. జనంలోను ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. అయినా ప్రభుత్వ నిర్వహిస్తున్న సర్వేలలో ఆరోగ్య సమస్యలు ఉన్నవారి సంఖ్య అధికంగా కనిపిస్తోంది. సంక్రమించని వ్యాధులపై ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా చేపట్టిన సర్వేలో రక్తపోటు (బీపీ), మధుమేహం (సుగర్) అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అతి కొద్దిమందికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సంక్రమించని వ్యాధుల సర్వే (ఎన్‌సీడీ)-3.0ను గతేడాది నవంబరు 14 నుంచి ప్రారంభించారు. జిల్లాలో వైద్య సిబ్బంది అంతా సర్వేలో నిమగ్న మయ్యారు. ప్రతి ఇంటా సర్వే నిర్వహిస్తున్నారు. వ్యాధుల నిర్ధారణతో పాటు అవసరమైతే నివారణ చర్యలకు ఉపయోగపడేలా సర్వే చేపడుతున్నారు. ఇప్పటిదాకా జిల్లాలో దాదాపు ఐదో వంతు సర్వే పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా 14,65,317 మంది ప్రజల నుంచి వివరాలు సేకరించాల్సి ఉంది. ప్రభుత్వం 18 ఏళ్ల వయసు నిండిన వారి నుంచి వివరాలు సేకరిస్తుంది. ఇప్పటిదాకా 2,44,421 మంది ప్రజల నుంచి వివరాలు సేకరించారు.



20 శాతం మందిపై ఆరోగ్య ప్రభావం

సర్వేలో విస్తుగొల్పే వివరాలు వెల్లడవుతున్నాయి. దాదాపు ఐదో వంతు మందికి సంక్రమించని వ్యాధి లక్షణాలున్నాయి. మధుమేహం, రక్తపోటు వెంటాడుతున్నాయి. జిల్లాలో మధుమేహం (సుగర్) వ్యాధికి సంబంధించి 24,673 మంది అనుమానితులున్నట్టు గుర్తించారు. అదేవిధంగా 19,975 మంది రక్తపోటు (బీపీ)తో బాధపడుతున్నారు. అతికొద్దిమందిలో క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. అందులో ఓవరీస్ క్యాన్సర్ 794 మందికి, బ్రెస్ట్ క్యాన్సర్ 615 మందికి, సర్వైకల్ క్యాన్సర్ మరో 648 మందికి ఉన్నట్టుగా అనుమానిస్తున్నారు. నివేదికలు తయారు చేశారు. క్యాన్సర్‌కు సంబంధించి అనుమానితులను మెరుగైన వైద్య పరీక్షల కోసం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి పంపిస్తారు. అక్కడ పరీక్షలు చేసి నిర్ధారణ చేసి అనంతరం వైద్య సదుపాయం అందించేలా చర్యలు తీసుకుంటారు. మండల వారీగా వారికి కేటాయించిన రోజున వారిని తీసుకువెళ్ళేలా సంబంధిత కిందస్థాయి సిబ్బందికి సమాచారం అందిస్తున్నారు. ఇంకా సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ సర్వేను జిల్లాలోని 57 పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లోను ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు నిర్వహిస్తున్నారు. సర్వేను పర్యవేక్షించేందుకు కమిటీ కూడా ఉంది. అందులో డీఎంహెచ్‌వో భానునాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ ధనలక్ష్మి, సుభాష్ పర్యవేక్షిస్తున్నారు. గతంలో రక్తపోటుకు సంబంధించిన వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువగా ఉండేది. ఇప్పుడు మధుమేహానికి సంబంధించిన వారి సంఖ్య పెరగడం కొంత ఆందోళన కలిగించే విషయమని వైద్యులు చెబుతున్నారు.



• ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి



జిల్లాలో నిర్వహిస్తున్న సర్వేలో మధుమేహ వ్యాధిగ్రస్తులు పెరగడం కొంత ఆందోళన కలిగించే విషయం. ముఖ్యంగా ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. శరీరానికి వ్యాయామం అందించాలి. ఇంట్లో మధుమేహం ఉన్నవారు ఉంటే కచ్చితంగా 40 ఏళ్లు దాటిన వారు సుగర్ పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం. దీనిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

- డీఎంహెచ్‌వో భానునాయక్

• వ్యాయామం చాలా అవసరం



ప్రతీ ఒక్కరూ తప్పని సరిగా వ్యాయమం చేస్తే చాలా మంచిది. ఏ ఆహారమైనా తీసుకోవచ్చు. అది కూడా మితంగా ఉండాలి. బరువు పెరగకూడదు. ఒత్తిడికి గురికాకూడదు. వీటిని పాటిస్తే మధుమేహం రాకుండా చూసుకోవచ్చు.

- శ్రీరామ్ ,ఆయుర్వేద వైద్యుడు

చేప ధర పతనం



- భారీగా తగ్గిన తెల్ల చేపల ధర
- నష్టాల ఊబిలో ఆక్వా రైతులు

కలిదిండి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : చేపల ధర పతనమైంది. ఇంతకు ముందు తెల్ల చేప కిలో రూ.120 ఉండగా ఒక్కసారిగా రూ.110కి పడిపోవడంతో చేపల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా నుంచి ప్రతి రోజు సుమారు 400 నుంచి 600 లారీల చేపలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అయ్యేవి. ప్రస్తుతం తెల్లచేప ధర పతనమవ్వడంతో 200 నుంచి 300 లారీలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. అస్సోం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో చేపల కొనుగోళ్ల మందకొడిగా జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల మేత డీవోబీ తవుడు 10 టన్నులు రూ.లక్షా 30 వేలు పలుకుతోంది. లీజు ఎకరాకు రూ.లక్ష వరకు ఉంది. ఖర్చు పెరిగి చేపల ధర పడిపోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. కాగా ఫంగస్ చేపల సాగు కూడా సంక్షోభంలో పడింది. ఫంగస్ సాగు చేసిన రైతులు భారీగా నష్టపోతున్నారు. ఇంతకు ముందు ఫంగస్ కిలో రూ.100 పలుకగా, ప్రస్తుతం రూ.80కి పడిపోయింది. కిలో ఫంగస్ పెరుగుదలకు రూ.90 ఖర్చు అవుతుందని మేత భారం ఎక్కువైందని కిలో రూ.80కి అమ్మితే తీవ్ర నష్టాల్లో మునిగి పోతాయని రైతులు వాపోతున్నారు. తెల్ల చేపలకు ఫంగస్‌కి గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మా..భూమి వివరాలు తెలపండి

రెవెన్యూకు పురపాలక అధికారుల లేఖ



నరసాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ 11 ఏళ్ల క్రితం నరసాపురం మండలం వేములదీవి రెవెన్యూ గ్రామంలో కొనుగోలు చేసిన ఐదెకరాల భూమి ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వం కూడా ఈ అంశంపై వివరణ కోరింది. మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష సభ్యులు ఈ వివాదంపై ఫైర్ అయిన విషయం విధి తమే. దీంతో మునిసిపల్ అధికారులు కొన్న భూమి ఏమైందన్న వివరాలను తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులకు లేఖ పెట్టారు. తమ వద్దనున్న రికార్డు వివరాలను తెలియజేస్తూ కమిషనర్ అంజయ్య లేఖ రాశారు. ఈ భూమికి సంబంధించిన జరిగిన కరస్పాండెండ్స్ , కొనుగోలు చేసినట్లు చలానా రశీదు, అప్పటి కలెక్టర్ సిదార్థజైన్ ఇచ్చిన ప్రోసీడింగ్స్, భూమికి సంబంధించిన మ్యాప్ తదితర వివరాలన్నీ తమ వద్ద ఉన్నాయన్నారు. అయితే ఈ భూమికి సంబంధించిన వివరాలు పోర్టల్‌లో కనిపించడం లేదన్నారు. దీనిపై వివరాలను తమకు తెలియజేయాలని లేఖలో కోరారు. ఇదిలా ఉంటే పురపాలక సంఘం వద్ద ఉన్న రికార్డు ప్రకారం వేముల దీవిలో 826/2లో ఐదెకరాలు కేటాయించినట్లు ఉంది. అయితే రెవెన్యూ రికార్డు పరిశీలిస్తే గ్రామంలో ఈ సర్వే నెంబర్‌లో మొత్తం 11.88 సెంట్లు ప్రభుత్వ భూమి మాత్రమే ఉంది. ఇందులో రెండు ఎకరాలు గత ప్రభుత్వ హయాంలో ఇళ్ళపట్టాలు ఇచ్చారు. ఇది కాకుండా మరో ఇద్దరికి 2.3, 2.9 ఎకరాలు డిఫాం పట్టాలు ఇచ్చినట్లు రికార్డులో ఉంది. ఇవి రెండు వారస్వత భూములుగా నమోదైంది. అయితే పురపాలక సంఘానికి ఇచ్చినట్లు రెవెన్యూ రికార్డులో మాత్రం కనిపించకపోవడం గమనార్హం.



వ.పా., బాపు ఆర్ట్ అకాడమి కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

చిత్రకళతో మానసిక వికాసం : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చిత్రకళలతో మానసిక వికాసం కలుగుతుందని, సమాజంలో చైతన్యం కలిగించవచ్చని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం రాత్రి వ.పా, బాపు ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నంద మూరి తారక రామారావు శత జయంతిని పుర స్కరించుకుని దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 60 మంది చిత్రకారులు ఎన్‌టీఆర్ చిత్రాలను స్పాట్ పెయింటింగ్ ద్వారా చిత్రీకరించారు. 60 మందిలో ఐదుగురు మహిళా చిత్రకారులు ఉన్నారు. కర్నాటక, తెలంగాణ, తమిళ నాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన ఆర్టిస్టులు ఎన్‌టీఆర్ చిత్రాలను చిత్రీకరించారు. కార్యక్రమంలో డి.రామకృష్ణారావు, తమిళనాడు ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటి డైరెక్టర్ ధర్మలింగరం, షణ్ముఖం, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జీ మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జయభారత రెడ్డి, పాపారావు నాయుడు, జీఎస్ఎన్, కొసనా భాస్కరరావు, చెల్లుబోయిన రాము, నక్కా వెంకటేశ్వరరావు కడలి శ్రీనివాస్, జీఎస్ఎన్.రవికుమార్, పలువురు ఆర్టిస్టులు, స్థానికులు పాల్గొన్నారు.



టీ-20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు

భీమవరంలో బధిరుల టీ-20

- 12, 13 తేదీల్లో పోటీలు
- పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

భీమవరంటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బధిరులు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటున్నారని, క్రికెట్‌లో ఛాంపియన్‌షిప్ స్థాయికి వెళ్లడం అభినందనీయమని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. 5వ రాష్ట్రస్థాయి బధిరుల టీ-20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీల బ్రోచర్ ఎమ్మెల్యే అంజిబాబు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 5వ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను భీమవరంలో రెండు రోజులపాటు నిర్వహించడం అభినందనీయమని, తన వంతు సహకారం అందిస్తానన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీ కృష్ణంరాజు, సీహెచ్ తాతారావు మాట్లాడుతూ ఈనెల 12,13 తేదీల్లో గన్నాబత్తుల క్రీడా మైదానంలో బధిరుల టీ-20 క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 10 టీమ్‌లు పాల్గొంటున్నాయని, డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు(బాబు) సహకారం అందిస్తామని తెలిపారన్నారు. దాతలు, క్రీడా అభిమానుల సహకార సౌజన్యంతో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. గతంలో నాలుగు సార్లు భీమవరంలోనే పోటీలను నిర్వహించామని, ఈ ఏడాది కూడా భీమవరంలోనే ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, అసోసియేషన్ సభ్యులు ఎస్ఎస్ శర్మ, ఎండి రఫి, జి.రామచంద్రరావు, ఆర్.ఉమామహేష్, తదితరులు పాల్గొన్నారు.



పాలమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1971-72 సంవత్సరంలో పదో తరగతి చదివిన మిత్రులు

ఐదు దశాబ్దాల తర్వాత అపూర్వ కలయిక

పెనుమంట్ర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వారంతా వయసు మళ్లిన వారే.. వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ కూడా చేశారు. వారు చదివిన పాఠశాల వారికి ఇప్పటికీ నిత్య నూతనమే. ఆ పాఠశాలలో పదో తరగతి చదివిన మిత్రులు 53 ఏళ్ల తర్వాత ఆదివారం నాడు కలుసుకున్నారు. పొలమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1971-72 పదో తరగతి చదివిన విద్యార్థులు అర్ధ శతాబ్దం తర్వాత కలిశారు. తాటాకు పాకలో నేలపై కూర్చుని చదువున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఒరేయ్ ఎలా ఉన్నావురా? మన సైన్స్ టీచర్ జోకులు గుర్తున్నాయా అంటూ చిన్ననాటి జ్ఞాపకాలతో ఆ వృద్ధులంతా మళ్లీ చిన్నపిల్లలయ్యారు. వీడు గొల్లపల్లి విలన్టిన్ ఎస్‌పీఎల్ కదా అంటూ జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మనకు చదువులు చెప్పిన గురువులు ఎప్పుడైనా కనపడ్డారా అంటూ ఆరా తీసుకున్నారు. మనమే వృద్ధులయ్యాం కదా.. అంటూ వారి టీచర్లకు గుర్తుగా పాఠశాలలో ఇప్పటి ఉపాధ్యాయులు కోడి చంద్రశేఖర్, పితాని పాండురంగారావు, కె.ఝాన్సీ లక్ష్మీబాయి, కేత విజయ్‌బాబును ఘనంగా సత్కరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులు కలిసి భోజనం చేశారు. సమయం ఇట్టే గడిచి పోయింది రా.. అంటూ ఎవరికి వారు తమ ఇళ్లకు పయనమయ్యారు.

భక్తులతో కిటకిటలాడిన ద్వారకాతిరుమల ఆలయం



స్వామి వారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. సుమారు 12 వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. శ్రీవారి ఉచితదర్శనానికి గంటల పైబడి సమయం పట్టింది. స్వామివారిని దర్శించేందుకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద భక్తులు బారులు తీరారు. అయితే మధ్యాహ్నం నుంచి రద్దీ కాస్త తగ్గుముఖం పట్టింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఏజెన్సీలో ఏ దారి చూసిన అమ్మవారి దర్శనానికి వెళుతున్న భక్తులే కనబడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంతం అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.



హోమం చేస్తున్న కర్నాటక భక్తులు

వైభవంగా వాసవి హోమం

పెనుగొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పెనుగొండ వాసవి శాంతి ధామ్ నందు కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు ఆదివారం వాసవి హోమం నిర్వహించారు. గోమాత పూజ, నగరేశ్వరుడికి రుద్రాభిషేకం దంపతి పూజ చేశారు. ప్రధాన అర్చకులు శిష్టా మణికంఠ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. వాసవి అమ్మవారు భానువాసర అలంకరణలో దర్శనం ఇచ్చారు. పరిసర ప్రాంత భక్తులు పూజలో పాల్గొన్నారు.

చిన్నారులపై చిత్రహింసలు



ఆస్పత్రిలో బాధిత పిల్లలతో తల్లి శారద, ప్రియుడిపై స్థానికుల దాడిని అడ్డుకుంటున్న శారద

- తల్లి కళ్లెదుటే బాలుడిని వైర్‌తో బాదిన ప్రియుడు
- పట్టించుకోని తల్లి
- ఇంటి నుంచి బయటకు పరుగు తీసిన బాలుడు
- స్థానికులు గమనించి తల్లి, ఆమె ప్రియుడికి దేహశుద్ధి
- పోలీసులకు ఫిర్యాదు
- జంగారెడ్డిగూడెంలో అమానుషం

ఏలూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో దారుణం చోటు చేసుకుంది. మహిళతో సహజీవనం చేస్తున్న వ్యక్తి ఆమె పిల్లలను వైర్‌తో విచక్షణారహితంగా రక్తం తేలేటట్లు కొట్టాడు. బాలుడు కేకలు వేస్తూ బయటకు పరుగు తీయడంతో స్థానికులు స్పందించి మహిళ, యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడితో పాటు అతడి చెల్లెలి ఒంటిపై గాయాలు స్థానికులను కలచి వేశాయి. పట్టణంలోని సుబ్బంపేటలో శనివారం రాత్రి గానాల శారద (శశి) తొమ్మిదేళ్ల కుమారుడు రాహుల్‌ను ఆమె ప్రియుడు నల్ల వెలుగుల పవన్ విద్యుత్ వైర్‌తో విచక్షణా రహితంగా కొట్టాడు. బాధ తట్టుకోలేక రాహుల్ బయటకు పరుగులు తీశాడు. రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి వద్దకు వెళ్లి అంకుల్ నన్ను కాపాడు అంటూ భోరున ఏడుస్తూ అడిగాడు. ఆ వెంటనే పవన్, శారద వచ్చి ఇది మా ఇంట్లో గొడవ మీకెందుకు అని ప్రశ్నించి రాహుల్‌ను తీసుకు వెళ్లడానికి ప్రయత్నించారు. గాయాలతో ఉన్న రాహుల్‌ను చూసి ఇంటి చుట్టు పక్కల వారు చలించిపోయారు. పవన్, శారదలపై ఆగ్రహంతో వారిద్దరికీ దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాలుడు రాహుల్, అతడి చెల్లెలు రేణుకను ఆసుపత్రికి తరలించారు. పవన్ అక్కడి నుంచి పరారయ్యాడు.

తల్లి కళ్లెదుటే హింసించినా..

ఆస్పత్రిలో శనివారం రాత్రి బాలలకు వైద్య సేవలందించి ఆదివారం ఉదయం వారిని ప్రశ్నించగా విచారించగా చిత్రహింసలను ఏకరువు పెట్టారు. ప్రతీరోజు రాత్రి ఇంట్లో పవన్ మద్యం సేవిస్తూ తల్లి కళ్లెదుటే రాహుల్, రేణుకను సెల్‌ఫోన్ వైర్‌తో విచక్షణారహితంగా కొట్టేవాడు. కన్నతల్లి ఏమాత్రం పవన్‌ను వారించేదికాదు. కొంతకాలంగా మాట వినడంలేదంటూ పవన్‌తో పాటు శారద కూడా పిల్లలను కొట్టేది. గట్టిగా అరుస్తున్నారని నోట్లో గుడ్డలు కుక్కి కూడా కొట్టేవారు. కొంత కాలం క్రితం రాహుల్ నోటిపై గట్టిగా కొట్టడంతో పళ్లు ఊడిపోయాయి. ఆ బాధలో ఉన్న బాలుడి నోట్లో పచ్చి మిరపకాయ పెట్టి రాక్షసానందం పొందారు. బాలిక రేణుకను 20 రోజుల క్రితం సెల్‌ఫోన్ చార్జర్ వైర్‌తో పవన్ గట్టిగా కొట్టడంతో ఎడమ కంటిపై తీవ్రగాయమైంది. బాలిక ఒళ్లంతా మానిన గాయాల మచ్చలతో నిండిపోయింది. శారద, పవన్ పిల్లలిద్దరినీ క్రూరంగా చిత్రహింసలు పెట్టారు. గాయాలకు చికిత్స చేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీకమల తెలిపారు.

కలెక్టర్ సీరియస్

చిన్న పిల్లలను క్రూరంగా హింసించడంపై కలెక్టర్ వెట్రిసెల్వి సీరియస్ అయ్యారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీకమల, ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలాతో ఫోన్‌లో మాట్లాడి పిల్లల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆసుపత్రి వైద్యులు, ఐసీడీఎస్ అధికారుల సంరక్షణలో చిన్నారులను ఉంచాలని ఆదేశించారు. బాధిత చిన్నారులను డీసీహెచ్ఎస్, ఐసీడీఎస్ పీడీ, శిశు సంరక్షణ అధికారులు, డీఎస్పీ, సీఐ పరామర్శించారు.

భర్తతో విడిపోయి..

కామవరపుకోట మండలం తాడిచర్లకు చెందిన గానాల శారద (శశి)కు తాడేపల్లిగూడెం వద్ద ఉన్న కూనవరం గ్రామానికి చెందిన గానాల గణేశ్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఉదయ రాహుల్, జశిత రేణుక ఇద్దరు పిల్లలు. కొంతకాలం తర్వాత గణేశ్ మద్యానికి బానిసై భార్యా పిల్లలను పట్టించుకోకపోవడంతో శారద భర్తను విడిచిపెట్టి పిల్లలతో తాడిచర్లలో తల్లి వద్ద ఉంటుంది. అదే గ్రామంలో గ్రామ వలంటీరుగా పనిచేసే నల్లవెలుగుల పవన్‌తో శారదకు పరిచయం ఏర్పడింది. దాదాపు ఐదేళ్ల నుంచి వారు సహజీవనం చేస్తున్నారు. శారద తమ్ముడికి పెళ్లి అయ్యే వరకు కొంతకాలం బయట ఉండాలని తల్లిదండ్రులు చెప్పారు. దీనితో శారద పిల్లలను తీసుకుని జంగారెడ్డిగూడెం సుబ్బంపేటలోని నేతాజీ నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటోంది. ఆమె ప్రియుడు పవన్ కూడా వాళ్లతోనే ఉంటున్నాడు. పవన్, శారద ఇద్దరూ వేర్వేరు హోటళ్లలో పనిచేస్తున్నారు.

కాగా ఈ సంఘటనపై బాలుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని డీఎస్పీ యు. రవిచంద్ర తెలిపారు. నిందితుడిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

ఆయుష్‌లో అక్రమాలు



- నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి
- 650 రోజులుగా మరో ఉద్యోగి గైర్హాజరు
- ఉన్నతాధికారులకు నివేదిక

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన వైద్య విధానాలను ప్రోత్సహించే ఆయుష్ శాఖలో అక్రమాల పర్వం కొనసాగుతోంది. ఒక ఉద్యోగి నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విధులు నిర్వహిస్తున్నాడు. మరొకరు ఏడాదిన్నరకు పైగా విధులకు హాజరుకు కావడం లేదు. వారి ఆగడాలపై ఆయుష్‌శాఖ కమిషనర్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ విచారించి కలెక్టర్‌కు నివేదించారు. ఒకరు నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విధులు నిర్వహించడం, మరో ఉద్యోగి 650 రోజులకుపైగా విధులకు గైర్హాజరవుతున్నట్లు రుజువైంది. ఉన్నతాధికారులు తదుపరి చర్యలకు సమాయత్తమవుతున్న దశలో అక్రమాలపై ఫిర్యాదు చేసిన అదేశాఖలో దివ్యాంగుడైన చిరుద్యోగిపై బెదిరింపులు మొదలయ్యాయి.

ఆయుష్‌శాఖ జోన్-2 పరిధిలోని ఏలూరు ప్రాంతీయ ఉపసంచాలకుని (ఆర్డీడీ) అజమాయిషీలో ఆయుర్వేదం, హోమియోపతి వైద్య సేవల నిమిత్తం జిల్లావ్యాప్తంగా వైద్యశాలలను నిర్వహిస్తున్నారు. ఏలూరు ఆర్డీడీ కార్యాలయంలో ఒక్క వ్యక్తి కారుణ్య నియామకంపై ఉద్యోగం పొందాడు. విధులు చేపట్టిన నాటి నుంచి దుష్ప్రవర్తన, లంచగొండితనం షరామామూలే అన్నట్టుగా కొనసాగుతున్నాడు. పదోన్నతికోసం అవసరమైన విద్యార్హత పొందడానికి కూడా అడ్డదారులనే ఎంచుకున్నాడు. తాడేపల్లిగూడెంలో ఓ ప్రైవేటు విద్యాసంస్థలో అడ్మిషన్ పొందిన ఇతను ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకున్నాడు. ఆయా తేదీల్లో కార్యాలయ విధులకు సెలవు పెట్టాల్సి ఉంది. దీనికిభిన్నంగా పరీక్షలు జరిగిన తేదీల్లో విధులకు హాజరైనట్టు ఉద్యోగి సంతకాలు పెట్టడం, మరోవైపు సంబంధిత విద్యార్హత సాధించినట్టు సర్టిఫికెట్లు అందజేసి పదోన్నతి పొందడం గమనార్హం. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి అసలు పరీక్షలనే రాయలేదని సమాచారం. ఈ విషయం వెలుగులోకి రావడంతో కార్యాలయ హాజరుపట్టీలో సంబంధిత పరీక్షలు జరిగిన రోజుల్లో విధులకు క్యాజువల్ లీవ్ పెట్టినట్టు దిద్దివేతలు, కొట్టివేతలున్నట్టు ఉన్నతాధికారుల పరిశీలనలో తేలింది.

ఆర్డీడీ ఆఫీసులో తిష్టవేసిన ఈ ఉద్యోగి కారుణ్య నియామకాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల క్లియరెన్స్, తదితర పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారి నుంచి పెద్దమొత్తాల్లో లంచాలు తీసుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి.

విధులకు గైర్హాజరు

దర్భాజీగూడెంలో పనిచేస్తున్న మరో ఉద్యోగి పని సర్దుబాటు(వర్క్ అడ్జస్ట్‌మెంట్)పై ఇక్కడ పనిచేస్తున్నారు. రోజువారీ విధులకు హాజరవుతున్నట్టు నమోదుచేయాల్సిన ఎఫ్ఆర్ఎస్ హాజరుగాని, అటెండెన్స్ బుక్‌లోగాని సంతకం చేయకుండానే జీతాలు చెల్లిస్తున్నట్టు రుజువైంది. ఉద్యోగి గైర్హాజరుపై స్థానిక ఆయుర్వేద వైద్యశాల వైద్యుడు ఏలూరులోని ఆర్డీడీ కార్యాలయానికి సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నప్పటికీ జీతభత్యాల చెల్లింపులు జరగడం గమనార్హం. విధినిర్వహణలో అక్రమాలకు పాల్పడుతున్న ఈ ఇద్దరు ఉద్యోగుల నిర్వాకంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేయడం, విచారణలో వాస్తవాలు బహిర్గతం కావడంతో ఇపుడు ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటూ తోటి ఉద్యోగిపై బెదిరింపులకు దిగడం ఆయుష్‌శాఖ ఏలూరు ఆర్డీడీ కార్యాలయంలో చర్చనీయాంశమైంది. దివ్యాంగుడైన ఫిర్యాదుదారు మరో ఏడాదిలో ఉద్యోగవిరమణ చేయనుండగా, ఫిర్యాదును ఉపసంహరించుకోకపోతే రిటైర్మెంట్ ఆర్థిక ప్రయోజనలేవీ ప్రభుత్వం నుంచి అందకుండా చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలిసింది.

కమిషనర్‌కు నివేదిక పంపించా

డాక్టర్ కల్పనా కటాక్షం, ఇన్‌చార్జి ఆర్డీడీ

ఇద్దరు ఉద్యోగుల పనితీరుపై ఫిర్యాదువచ్చిన విషయం వాస్తవమే. సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగికి జనవరి జీతభత్యాల చెల్లింపు నిలిపివేశాం. విద్యార్హతలు, హాజరుపట్టీలో దిద్దివేతలు, తదితర ఆరోపణలు వచ్చిన మరో ఉద్యోగిపై విచారణచేసిన నివేదికను ఆయుష్‌శాఖ కమిషనర్‌కు పంపించాను. కమిషనర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం విచారణ నివేదికలోని అంశాలను బహిర్గతం చేయలేను. వారిద్దరిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు అందింది.

కుటుంబ సమస్యలతో ఉరి వేసుకుని ఆత్మహత్య

పెంటపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన ఆదివారం పడమర విప్పర్రు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పడమర విప్పర్రు గ్రామానికి చెందిన చందనాల పెద వెంకటేశ్వరరావు (50) వ్యవసాయ కూలీ. అతడికి ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. చిన్న కుమార్తె ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం, అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్వరరావు ఆదివారం పొలంలోని గేదెల పాక వద్ద దూలానికి తాడుతో ఉరి వేసుకుని చనిపోయాడు. భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

రైలు నుంచి జారి పడి..

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న రైలు నుంచి జారిపడి ఒక యువకుడు మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు ఫ్లైఓవర్ బ్రిడ్జిలో రైలుపట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఉన్నట్లు రైల్వే ఎస్ఐ పి సైమన్‌కు ఆదివారం సమాచారం అందింది. సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. 5.6 అడుగుల ఎత్తు కల్గి తెలుపురంగు పొట్టి చేతుల టీ షర్టు, నలుపు, నీలం రంగు షార్టు ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి మరణించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చీటీ సొమ్ము ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం శివ గోపాలపురం ప్రాంతానికి చెందిన అందే తేజశ్రీ ఫ్యాన్సీషాపు నిర్వహిస్తుంది. స్థానికంగా ఒక మహిళ వద్ద నెలకు రూ25 వేల చీటీ కడుతోంది. పాడుకున్న సొమ్మును ఎక్కువ వడ్డీ ఇస్తానని నమ్మబలికి సొమ్ములను ఆమె వద్దే ఉంచుకుంది. ఎంత కాలానికి సొమ్ములు ఇవ్వకుండా ఆమె ఊరు వదిలి వెళ్లిపోయిందని, ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉందని మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం సర్ఫ్ లిక్విడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా కేసు నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. గొల్లగూడెంకు చెందిన పంపన వెంకటస్వామి(55) శనివారం మోటార్ సైకిల్ వెళుతుండగా గొల్లగూడెం అడ్డరోడ్డు వద్ద మరో మోటార్ సైకిల్ వేగంగా ఢీకొంది. వెంకటస్వామి తీవ్రంగా గాయపడడంతో స్థానికులు ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో..

తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెంకు చెందిన బొమ్మగంటి రామయమ్మ (68) ఈనెల 1న టీ తాగేందుకు గ్యాస్ పొయ్యి వెలిగించుకోగా మంటలు వ్యాపించాయి. కాలిన గాయాలు కావడంతో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పపొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు. దీనిపై కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

నేడు వీరంపాలెంలో సామూహిక అక్షరాభ్యాసం

తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి, సరస్వతి అమ్మవారి జన్మదినం పురస్కరించుకుని వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో మేధా సరస్వతి సమక్షంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించ నున్నారు. క్షేత్రంలో అమ్మవారి ఆశీస్సులతో తమ పిల్లలకు విద్యా బుద్ధులు ప్రసాదించాలని జిల్లాలోనే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తల్లిదండ్రులు తరలి వస్తుంటారు. ఆలయ క్షేత్రంలో ఎంతమంది వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా అక్షరాభ్యాసాలు చేసేవిధంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక బారికేడ్‌లు, పూజలకు ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటుచేసినట్టు ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకట రమణ సిద్ధాంతి తెలిపారు.

భీమవరం హాస్పిటల్స్‌లో పీజీ విద్య



పీజీ విద్యార్థులతో భీమవరం హాస్పిటల్స్ యాజమాన్యం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిన అమిరంలోని భీమవరం హాస్పిటల్స్ వైద్య సేవలతో పాటు వైద్య విద్య అందిస్తుందని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కేవీ కృష్ణంరాజు, చైర్మన్ గోపాలరాజు, ఆర్.శ్రీనివాస్ రాజు తెలిపారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మత్తు విభాగానికి సంబంధించి భీమవరం హాస్పిటల్‌కు నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ డిప్లొమెట్ ఆఫ్ నేషనల్ బోర్డు (డీఎన్‌బీ) పోస్టు గ్రాడ్యుయేషన్‌కు అనుమతి ఇచ్చిందన్నారు. కేరళకు చెందిన ఇద్దరు విద్యార్థులు డీఎన్‌బీ చేసేందుకు తమ హాస్పిటల్‌ను ఎంపిక చేసుకున్నారని తెలిపారు. 20 ఏళ్లుగా అన్ని రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందిస్తున్నామని, ఇప్పుడు పీజీ వైద్య విద్యా కార్యక్రమాలను జిల్లాలో మొదటిసారిగా ప్రారంభిస్తున్నామన్నారు. అనస్థీషియా విభాగంలో పీజీ విద్యకు ఇద్దరు విద్యార్థులు చేరారని, త్వరలో రేడియాలజీ ఇతర స్పెషాలిటీ వైద్య విభాగాలలో సీట్లు అందుబాటులోకి రానున్నాయన్నారు.





మావుళ్లమ్మ ఉత్సవాలలో నృత్య ప్రదర్శనలతో అలరించిన చిన్నారులు

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

భీమవరం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ ఆలయ వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం కళావేదికపై చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. గునుపూడికి చెందిన ఉమా సోమేశ్వర కూచిపూడి నాట్య కళాక్షేత్రం బృందం నిర్వహించిన కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. దాదాపు రెండు గంటలపాటు చిన్నారులు పలు కీర్తనలకు, భక్తి గీతాకు నృత్యాలు చేశారు. గురువు ఎస్ వైష్ణవి మణికంఠ పర్యవేక్షణలో చిన్నారుల ప్రదర్శన మంత్రముగ్ధులను చేసింది. మధ్యాహ్నం 12 గంటలకు హరే శ్రీనివాస కోలాట భజనమండలి కోలాట భజన నిర్వహించారు. 3 గంటలకు నల్లజర్ల శ్రీరామకృష్ణ భజన సమాజం వారిచే భజన, సాయంత్రం 4 గటలకు దిరుసుమర్రుకు చెందిన కెల్లా జగన్నాథం ప్రవచనాలు జరిగాయి. రాత్రి 9 గంటలకు అత్తిలికి చెందిన సత్య ఆర్కెస్ట్రా వారిచే సినీ సంగీత విభావరి నిర్వహించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా టీడీపీ : తోట



తోట సీతారామలక్ష్మిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న వేణు కుటుంబసభ్యులు

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ టీడీపీ అండగా ఉంటుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం పట్టణం 36వ వార్డులోని టీడీపీ కార్యకర్త గుత్తుల వేణు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా కార్యకర్తల సంక్షేమ ప్రమాద బీమా నిధి నుంచి రూ. 2 లక్షలు చెల్లించారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులు తోట సీతారామలక్ష్మిని, టిడిపి నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకుని ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలకు ప్రమాద బీమా అండగా నిలుస్తుందని తెలిపారు. టీడీపీ పట్టణ కార్యదర్శి గూడూరి సుబ్బారావు, అంగన్‌వాడీ, డ్వాక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, టీడీపీ భీమవరం మండల అధ్యక్షుడు రేవు వెంకన్న, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మందేరేశ్వర స్వామికి బొలిశెట్టి శ్రీనివాస్ పూజలు



స్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : వల్లూరుపల్లి మందేరేశ్వరస్వామి నూతన ఆలయ ప్రారంభ పూజలు రెండవ రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్వామి వారికి పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనాల నడుమ ఎమ్మెల్యే బొలిశెట్టికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బొలిశెట్టి అన్నసమారాధన నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ, భారీ అన్నసమారాధన జరుగుతుందని ఈవో చీమలకొండ సాయి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వేదుల వెంకటేష్ తెలిపారు. సర్పంచ్ దంగేటి అన్నవరం, జనసేన మండల అధ్యక్షుడు పుల్లా బాబి, మాజీ సర్పంచ్‌లు అడ్డగర్ల గంగరాజు, అచ్యుత అన్నవరం, అడబాల నాగవెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కొమ్ముచిక్కాలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవ పూజల్లో పితాని దంపతులు

పోడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కొమ్ముచిక్కాలలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ నిర్మించిన ఆలయంలో మానేపల్లి రామలింగేశ్వరశర్మ మంత్రోచ్చరణలతో శ్రీవారి బ్రహ్మోత్సవ పూజలు, సంకల్పం, పుణ్యావాచకం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే సత్యనారాయణ అనంతలక్ష్మి దంపతులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హోమం పూజలు, భక్తులచే 108 కలశాలతో కలశ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లయన్స్ క్లబ్ సేవలో అందరూ భాగస్వాములు కావాలి : ఆరిమిల్లి



ఆరిమిల్లిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ నాయకులు

తణుకు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం తణుకులో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్స్ జోనల్ సోషల్ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తణుకు ప్రభుత్వాసుపత్రిలో 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వంక రవీంద్రనాథ్ సహకారంతో లయన్స్ ద్వారా మొట్టమొదటి డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామని, త్వరలో అత్తిలిలో కూడా డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. పలువురు లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మారెమ్మ తిరునాళ్లకు ఎమ్మెల్యే ధర్మరాజు చేతుల మీదుగా విరాళం అందిస్తున్న జనసేన కార్యకర్తలు


మారెమ్మ తిరునాళ్లు సమష్టిగా నిర్వహించుకోవాలి : పత్సమట్ల

గణపవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా తిరునాళ్ళు సమష్టిగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. ఆదివారం గణపవరంలో దండు మారెమ్మ తిరునాళ్ల ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులు, పురప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత అమ్మవారికి పూజలు నిర్వహించి మాట్లాడారు. వారం రోజుల పాటు జరిగే మారెమ్మ తిరునాళ్ళు ప్రశాంత వాతావరణంలో వైభవంగా నిర్వహించుకోవాలన్నారు. గణపవరం గ్రామ జనసేన కార్యకర్తలు అమ్మవారి తిరునాళ్ళకు రూ.లక్ష విరాళం ఎమ్మెల్యే ధర్మరాజు చేతుల మీదుగా ఉత్సవ కమిటీ సభ్యులకు అందించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు, జనసేన నాయకులు వంగా రఘు, సరిపల్లి చిన్న, కొనిశెట్టి రమేష్, తోట శ్రీనివాసరావు, గాజుల వెంకటేశ్వరరావు, తోట పవన్, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్‌కేఆర్'కు జాతీయ స్థాయి సిస్కో నెట్‌వర్కింగ్ అవార్డు

భీమవరం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయస్థాయి సిస్కో నెట్‌వర్కింగ్ అవార్డు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా సిస్కో నుంచి వచ్చిన అవార్డును కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మకు అందించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అంతర్జాతీయ కంపెనీ సిస్కో ప్రతి ఏటా భారతదేశంలో అత్యుత్తమ కళాశాలలను గుర్తించి సిస్కో నెట్‌వర్కింగ్ అకాడమీ అవార్డులు ప్రదానం చేస్తుందని, ప్రస్తుత ఏడాదికి గాను తమ కళాశాలకు అవార్డు లభించిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు తెలిపారు. అదేవిధంగా కళాశాల ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ పి.రవికిరణ్ వర్మ జాతీయ ఉత్తమ సిస్కో అకాడమీ ఇన్‌స్ట్రక్టర్ అవార్డును అందుకున్నారు. కళాశాల సిస్కో అకాడమీ హెడ్ డాక్టర్ రవికిరణ్ వర్మ మాట్లాడుతూ కళాశాలలో సిస్కో అకాడమీ ద్వారా సీ, పైథాన్ ప్రోగ్రామింగ్, నెట్ వర్కింగ్, తదితర అంతర్జాతీయ సర్టిఫికెట్ కోర్సులు అదనంగా అందిస్తున్నామన్నారు.

బాధిత కుటుంబానికి జనసేన ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న వెంకటరామయ్య

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు జనసేన నాయకులు ముందుంటారని జనసేన నేత పైబోయిన వెంకటరామయ్య పేర్కొన్నారు. ఎల్.అగ్రహారానికి చెందిన ఉన్నమట్ల దుర్గారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఎమ్మెల్యే బొలిశెట్టి సూచనలతో రూ.లక్ష నగదును ఆదివారం అందించారు.

పీడీ కృష్ణారెడ్డికి ఉద్యోగ విరమణ సన్మానం

పెనుమంట్ర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బాస్కెట్ బాల్ క్రీడకు అంతర్జాతీయ ప్రఖ్యాతి తెచ్చిన మార్టేరు గ్రామం అని, అలాంటి చోట పుట్టిన పీడీ కర్రి కృష్ణారెడ్డి ధన్యజీవి అని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి మార్టేరులోని ఎస్వీజీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎస్వీజీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఉద్యోగ విరమణ సభలో ఆయన మాట్లాడారు. సుదీర్ఘకాలం పీఈటీగా, పీడీగా సేవలు అందించారన్నారు. బాస్కెట్ బాల్ సెక్రటరీ చక్రవర్తి, యూత్ బాస్కెట్ బాల్ అధ్యక్షుడు చిర్ల బాలాజీ రెడ్డి, నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి, అల్లం భాస్కర రెడ్డి, అల్లం బుల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గణపవరంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి ఆదివారం తెలిపారు. అతడి వద్ద నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. దాడిలో ఎస్ఐలు మురళీమోహన్, దొరబాబు పాల్గొన్నారు.

ధ్యానంపై శిక్షణ

అత్తిలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అత్తిలి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ ఆధ్వర్యంలో రాయకుదురుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ పి.శ్రీనివాస్ ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ధ్యానంతో సమస్త రోగాలను నయం చేయవచ్చన్నారు. పిరమిడ్ సొసైటీ ప్రతినిధులు దాసం వెంకటప్రసాద్, కడలి మాణిక్యాలరావు, బాలాజీ పాల్గొన్నారు.

దాళ్వా సాగు ఆలస్యం / చేలల్లో ముంపునీరు లాగక తీవ్ర ఇబ్బందులు



మొగల్తూరులో వరి నాట్లు వేస్తున్న కూలీలు

మొగల్తూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): డెల్టా తీరమైన మొగల్తూరు మండలంలో దాళ్వా సాగు ఆలస్యంగా సాగుతోంది. సాగునీటికి శివారు ప్రాంతం కావడంతో దాళ్వా సాగు ముందస్తుగా చేపట్టడం ఆనవాయితీ. సార్వా కోతలు సమయం నుంచి డిసెంబరు నెల చివరి వరకూ భారీ వర్షాలు కురవడంతో చేలు ముంపు బారిన పడ్డాయి. తీరంలోని దర్బరేవు, గొంతేరు డ్రెయిన్ వంటి మురుగు డ్రెయిన్‌లు ముంపు నీరు లాగకపోవడంతో దాళ్వా సాగు కోసం వేసిన ఆకుమడులు ముంపు బెడదతో కుళ్ళిపోయాయి. మరోసారి నారుమడులు సిద్ధం చేసుకున్న రైతులు చేలల్లో ముంపు నీరు లాగడంతో దమ్ములు చేసి సాగుకు వరి నాట్లు వేస్తున్నారు. మండలంలో దాళ్వా సాగుకు సంబంధించి 1,984 ఎకరాల్లో చేపట్టవచ్చని అధికారులు అంచనా వేయగా ఇప్పటివరకూ 600 ఎకరాల్లోనే వరి నాట్లు వేశారు. ఎంటీయూ 1121, 1156, 1158 రకం వరి విత్తనాలు సాగుకు వినియోగిస్తే 120 నుంచి 140 రోజుల్లో దిగుబడి సాధించవచ్చని అధికారులు సూచనలిస్తున్నారు.



వార్డులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

వారంలో డయాలసిస్ సెంటర్ ప్రారంభిస్తాం

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో మరో వారం రోజుల్లో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తామని మంత్రి డాక్టర నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి వార్డులను, డయాలసిస్ సెంటర్ పనులు పరిశీలించారు. రూ.12.60 కోట్లతో నిర్మాణంలో ఉన్న నూతన భవనాల నిర్మాణ పనులపై ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచనలు ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ డయాలసిస్ సెంటర్ పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు రెండు, మూడు రోజుల్లో పూర్తి చేస్తారని తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వర్మ, సిబ్బంది. నాయకులు జీవీ, పెచ్చెట్టి బాబు, మహ్మద్ జానీ, ఎం. పెద్దిరాజు, ధనాని ప్రకాష్, వట్టం గణేష్, బి. శేఖర్, జగ్గురోతు రాంబాబు, తదితరులు ఉన్నారు.

జగన్నాథపురంలో చోరీ

గణపవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గణపవరంలోని జగన్నాథపురంలో రివైండింగ్ వర్కు చేస్తున్న ఎండీ నజీర్ ఇంట్లో దొంగలుపడి సుమారు రూ. రెండు లక్షల విలువైన బంగారపు వస్తువులు అపహరించుకుపోయారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆదివారం ఎస్ఐ మణికుమార్ తెలిపారు. నజీర్ కుటుంబసభ్యులు ఇంట్లోలేని సమయంలో గుర్తుతెలియని దొంగలు ఇంట్లోని బంగారపు వస్తువులను తస్కరించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వేలిముద్ర నిపుణులు సేకరిస్తున్నామన్నారు.

ఎస్ఐ మృతిపై దర్యాప్తు జరపాలి : కారుమూరి

తణుకు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ ఎస్ఐ మృతిపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయించాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం తణుకు వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తణుకులో పరిస్థితులపై ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేశారు. 5న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు పెన్మత్స సుబ్బరాజు, వెలగల సాయిబాబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్చికి కృపాపీఠం బహూకరణ

తణుకు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దువ్వలోని రక్షణ సైన్యం చర్చికి గ్రామానికి చెందిన ననమండ్ర వెంకటేశ్వర్లు, కళ కృపా పీఠం బహూకరించినట్లు పాస్టర్ జయానంద్ తెలిపారు. లత, జోషి, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

క్రిస్టియన్ కౌన్సిల్ కార్యవర్గం

తణుకు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్ర జ్యోతి): జాతీయ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) తణుకు నియోజవకర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోజ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షులుగా బిషప్ కేవీస్ రాజు, కార్యదర్శిగా బి.జాషువా, మహిళా అధ్యక్షురాలుగా ఎస్. స్వర్ణకళ ఎన్నికైనట్లు తెలిపారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలు ఆదివారం నిర్వహించారు. సంచార శకటం ద్వారా మంచానికే పరిమితమైన వృద్ధులకు ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి ఆరుగురికి వైద్య సేవలందించారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, నల్లజర్ల వెంకటేశ్వరరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు.

అమ్మవార్లకు 'కారుమూరి' పూజలు

అత్తిలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆరవల్లిలో గ్రామ దేవతలు కనకదుర్గమ్మ, మావుళ్ళమ్మ, మహంకాళమ్మ, మారమ్మ, చెవుళ్ళమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ జాతర మహోత్సవం నిర్వహించారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, తదితరులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

రైతుల్ని ఇబ్బందులు పెడితే సహించేది లేదు



అధికారులతో మాట్లాడుతున్న షరీఫ్, పాత్తూరి

నరసాపురం,ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): రైతులను ఇబ్బందులు పెడితే సహించేది లేదు. ప్రభుత్వం మారినా.. కొంత మంది దళారులు, అధికారుల తీరు మారడం లేదు, ఇంకా పాత ప్రభుత్వమే ఉందన్న ధీమాతో ఉన్నారు' అని ప్రభుత్వ మైనార్టీ సలహాదారు షరీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కొంతమంది రైతులు దళారుల వల్ల తాము పడుతున్న ఇబ్బందుల్ని టీడీపీ నేతల వద్ద ప్రస్తావించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తీరప్రాంతానికి చెందిన కొంత మంది రైతులు మెరక భూమిల్లోని మట్టి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసుకుంటుంటే దళారులు అడ్డుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ కొంత మంది రైతులు ఫిర్యాదు చేశారన్నారు. ప్రభుత్వ భూముల్లో గాని, సీఆర్‌జడ్ భూముల్లో గాని చట్టవిరుద్ధంగా రైతులు మట్టిని, ఇసుకను తవ్వడం లేదు, వారి భూమిల్లోనే మట్టి తవ్వుకుని బయటకు సరఫరా చేసుకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాల మూలంగా వ్యవసాయ పనులు లేక రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి కోసం వారు చేసుకుంటున్న ఈ పనుల్ని అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు, దళారులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. దీనిపై అధికారులు స్పందించి దళారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



మొగల్తూరు గాంధీ బొమ్మల సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం నాయకుల నిరసన

భీమవరం అర్బన్/నరసాపురం టౌన్/ మొగల్తూరు/ పాలకొల్లు టౌన్/ ఆచంట/ తాడేపల్లిగూడెంరూరల్/ తణుకు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉన్నదని సీపీఎం నిరసన వ్యక్తం చేసింది. భీమవరంలో ఆదివారం జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ కార్పొరేట్లకు అనుకూలంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. సీపీఎం జిల్లా నాయకులు ఇంజేటి శ్రీనివాస్, పట్టణ నాయకులు త్రిమూర్తులు, డేగల నాగేశ్వరరావు పాల్గొన్నారు. నరసాపురంలో వనువులమ్మ ఆలయం వద్ద కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు రూ200కోట్లు కేటాయించడాన్ని నిరసిస్తూ ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంఘం జిల్లా నాయకులు బుడిద జోగేశ్వరరావు నేతృత్వంలో నిరసన తెలిపారు. మొగల్తూరు మండలం మొగల్తూరు గాంధీ బొమ్మల సెంటర్‌లో సీపీఎం మండల కార్యదర్శి వడుగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు ఎడ్ల చిట్టిబాబు, కొత్తపల్లి నాగరాజు, ఆదూరి సాంబమూర్తి, బజారు జట్టు కార్మికులు పాల్గొన్నారు. పాలకొల్లు పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో ఆదివారం ఏఐవైఎఫ్ జిల్లా సమితి సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ నిరుద్యోగసమస్యల పరిష్కారానికి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బడ్జెట్‌లో మొండిచేయి చూపించిందన్నారు. ఆచంట మండలం ఆచంట సంత మార్కెట్ వద్ద బడ్జెట్‌కు వ్యతిరేకంగా నల్ల జెండాలతో సీపీఎం మండల కార్యదర్శి పి. మోహనరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తాడేపల్లిగూడెంలోని సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పోలీస్ ఐలాండ్ వద్ద సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం తణుకు సీపీఎం కార్యాలయం వద్ద బడ్జెట్ ప్రతులను సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కామన మునిస్వామి ఆధ్వర్యంలో దహనం చేశారు.

'చిత్తడి నేలలు మన డెల్టా ప్రాంతానికి వరం'

భీమవరంటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మన డెల్టా ప్రాంతానికి చిత్తడి నేలలు ఒక వరమని అనేక సంవత్సరాలుగా ఇక్కడ ఉన్న చిత్తడి నేలలు నీటిని శుద్ధి చేసి భూగర్భ జలాలను పెంచడంతోపాటు వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని రిటైర్డు ప్రొఫెసర్ పీఆర్‌కే రాజ అన్నారు. స్వేస్ సంస్థ ఆధ్వర్యంలో చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ వ్యవసాయాధికారి కె.కమలాకర్ శర్మ మాట్లాడుతూ చిత్తడి నేలలు కార్బన్ ప్రాసెసింగ్‌లో ముఖ్యమైన భూమిక పోషిస్తాయన్నారు. కె. గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ భూగర్భ నీటి నిల్వలు పెంచడంలో చిత్తడి నేలలు ఉపయోగపడుతున్నాయన్నారు. తమ్మినీడి నాగేశ్వరరావు, ఎం.సత్యనారాయణ రాజు, స్వేస్ ప్రెసిడెంట్ గోపిశెట్టి మురళీకృష్ణారావు, దండు జగన్నాథరాజు, పాతపాటి మురళి రామరాజు మాట్లాడుతూ తుఫానులు, వరదల నుంచి తీర ప్రాంతాలను కాపాడడంలో చిత్తడి నేలలు ఉపయోగపడుతున్నాయన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా బల్లల పూజ



భీమవరంలో బల్లల పూజకు వెళ్తున్న మహిళలు, రజకులు

భీమవరంటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 19వ వార్డులో, పేరంటాల చెరువు గట్టు వద్ద శ్రీఆదిలక్ష్మి రజక సంఘం ఆధ్వర్యంలో గత 120 ఏళ్లుగా సంప్రదాయబద్ధంగా బల్లలపూజ నిర్వహిస్తున్నారు. సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మా పూర్వీకులు 120 సంవత్సరాల క్రితం రజక సంఘ పెద్దలు బల్ల పండుగ ప్రారంభించారన్నారు. సంక్రాంతి, భోగి పండుగ నుంచి బల్లల పూజ రోజు వరకు రజక వృత్తిదారులు సెలవు పాటించి, గంగమ్మ తల్లికి ధూప దీప నైవేద్యాలు హారతులు ఇచ్చి, పసుపు, కుంకుమ చలివిడిపానకాలు సమర్పిస్తామన్నారు. ఆదిలక్ష్మి రజక సంఘం నాయకులు దొమ్మేటి నరసింహమూర్తి, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, నేదునూరి గంగాధర తిలక్, దొమ్మేటి సుబ్బయ్య, అమనాపు వెంకటేశ్వరరావు, రజక యూత్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మాచేనమ్మ ఆలయంలో..

ఆచంట : పెదమల్లం మాచేనమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ, సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

తణుకు సూర్యదేవాలయంలో..

తణుకు : మాఘ మాసం ప్రారంభం సందర్భంగా పట్టణంలోని సూర్య దేవాలయంలో ఆదివారం స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కమిటీ నిర్వాహకులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

నేడు పెద్దింట్లమ్మ కల్యాణం..

ఆకివీడు:పెద్దింట్లమ్మ ఆలయ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణం నిర్వహిస్తామని ఈవో రాజు తెలిపారు. ఆదివారం స్థానిక పెద్దింట్లమ్మ దేవస్థానంలో అర్చకులు పూజలు నిర్వహించారు. మంగళవారం గ్రామోత్సవం జయప్రదం చేయాలని కోరారు.

బండి ముత్యాలమ్మకు పూజలు

మొగల్తూరు : ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ సన్నిధిలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కుబడులైన దూపహారం, కుంభహారాలను అమ్మవారికి నివేదించారు. భక్తులకు కావల్సిన సదుపాయాలను ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఈవో మోకా అరుణ్ కుమార్, సిబ్బంది కల్పించారు.

7 నుంచి లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాలు

పెనుమంట్ర: నెగ్గిపూడి శివారు వనంపల్లిలో చినఅంతర్వేదిగా ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ తోలేటి రాంబాబు తెలిపారు. ఏడో తేదీ రాత్రి కల్యాణం, 11న సాయంత్రం అన్నసమారాధన జరుగుతుందన్నారు.

రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెనుమంట్ర : ఆలమూరులో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో సీతాసమేత కల్యాణ రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. జిల్లా బీసీ సెల్ నాయకులు కడలి ఏడుకొండలు దంపతులు మహాశాంతి హోమం నిర్వహించారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జడ్పీ చైర్మన్ పద్మశ్రీ దంపతులు, మాజీ ఎమ్మెల్సీ మల్లుల లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన రావు, ఎమ్మెల్సీ కౌరు శీను పూజలు చేశారు.

ఇంటర్వ్యూ..

రెవెన్యూ సదస్సుల్లో 454 దరఖాస్తులు స్వీకరించాం



జి.పవన్‌కుమార్, తహసీల్దారు, యలమంచిలి

- **రెవెన్యూ సదస్సులపై వివరించండి?**

జవాబు: మండలంలోని 32 గ్రామాల్లో సదస్సులు నిర్వహించాం. మొత్తం 454 దరఖాస్తులు రాగా 211 పరిష్కరించాం. మిగిలినవి పరిష్కరిస్తాం.

- **రీసర్వేపై వచ్చిన ఫిర్యాదులెన్ని?**

జవాబు: 250 రాగా 122 పరిష్కరించాం. మిగిలినవి ఎక్కువగా జాయింట్ ఎల్‌పీఎంలకు సంబంధించినవి. వీటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం.

- **రీసర్వే లక్ష్యం ఏమిటి?**

జవాబు: భూ సమస్యలు లేకుండా నూరుశాతం పారదర్శకమైన భూమి రికార్డులను రూపొందించడమే లక్ష్యం. పెనుమర్రులో రీసర్వే మూడు బృందాలతో నిర్వహిస్తున్నాం.

- **కొత్తగా ఎన్ని రేషన్‌దుకాణాలకు డీలర్లను నియమించారు?**

జవాబు: మండలంలో 5 దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాతపరీక్ష నిర్వహించాం. ఉత్తీర్ణత సాధించిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలు పూర్తిచేస్తాం.

(ఆంధ్రజ్యోతి-యలమంచిలి)



ఆందోళన చేస్తున్న విశ్వాసులు

లూథరన్ చర్చిలో ఉద్రిక్తత

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 2, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లూథరన్ చర్చిలో ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు చర్చి వద్ద భారీగా మొహరించారు. చర్చి రెవరెండ్‌గా కొనసాగుతున్న మార్టిన్‌ను బదిలీ చేసి కొత్త రెవరెండ్‌గా నవకుమార్‌ను గుంటూరు ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ సంఘం అధ్యక్షుడు పరదేశిబాబు నియమించారు. ఈ బదిలీ చెల్లదంటూ రెండు వర్గాల విశ్వాసులు వాగ్వాదానికి దిగారు. ఇద్దరు రెవరెండ్‌లకు మద్దతుగా కొంతమంది విశ్వాసకులు విడిపోయి తోపులాటలకు దిగారు. ఈ విషయం తెలుసుకుని పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఇరువర్గాలకు పోలీసులు సూచించారు. ఇద్దరు పాస్టర్లను పక్కనపెట్టి నిడదవోలు సెనేడ్ అధ్యక్షుడు ఆనందకుమార్‌తో ప్రార్థనలు నిర్వహించారు.

సింహాచలం సంస్మరణ సభ

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తపించే కార్మిక నేత పైలా సింహాచలం లేని లోటు తీరనిదని పలువురు వక్తలు అన్నారు. జనవరి 23వ తేదీన మరణించిన ఆయన సంస్మరణ సభ ఆదివారం మావుళ్ళమ్మ పేటలో ప్రజా చైతన్య సమైక్య వ్యవస్థాపక అధ్యక్షుడు యింటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ మాట్లాడారు. కార్మికల శ్రేయస్సే ధ్యేయంగా సింహాచలం పనిచేశారన్నారు. మత్స్యకార సంఘ నాయకుడు గాడి నెహ్రూ, పీడీఎం రాష్ట్ర నాయకుడు దీపాటి శివప్రసాద్, తదితరులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

భీమవరంటౌన్,ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థికి చదువే మూలధారమని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని జనసేన పట్టణ కార్యదర్శి సుంకర రవి అన్నారు. భీమవరం రెడ్డి కాలనీలోని శ్రీసిద్ధి గణపతి ఆలయంలో పంచమిని పురస్కరించుకుని 210మంది చిన్నారులచే సరస్వతి పూజ, పెన్నులు, పుస్తకాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ఎంతో ప్రతిభ దాగి ఉంటుందని, అనుకున్న లక్ష్యాలను సాధించేలా పట్టుదల క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని అన్నారు. కార్యక్రమంలో రామాయణం రమేష్ బాబు, కొనల చిన్నారి, పంతం ప్రసాద్, గాలి నరసింహారావు, బుర్ర మాణిక్యాలరావు, జక్కా సుబ్బారావు, సాదనాల నాని, మురళీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సారె సమర్పించిన భక్తులు

వీర పేరంటాలమ్మకు సారె సమర్పణ

ఉండి, ఫిబ్రవరి 2, (ఆంధ్రజ్యోతి) : వెలివర్రు గ్రామంలోని వీర పేరంటాలమ్మ అమ్మవారికి ప్రముఖ వ్యాపారి ముదుండి శ్రీనివాసరాజు దంపతులు పలు రకాలతో సారె తీసుకుని వచ్చి సమర్పించి భక్తిని చాటుకున్నారు. తొలుత అమ్మవారి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారికి సారె సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మంతెన రంగరాజు దంపతులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.